**ఆరోజు నారాయణస్వామి కలవకపోతే ఈ కథ రాసే వాడిని కాదు. ఆ రోజు ఆదివారం. పైగా మబ్బులుపట్టి వర్షం కురవడానికి సిద్ధంగా వుంది. మామూలుగానే బెనర్జీ నేను కూర్చుని చదరంగం ఆడుకుంటున్నాము.**

సెలవురోజు ఈ విధంగా ఎంజాయ్ చేయడం మాకు అలవాటు. బెనర్జీ ఇల్లు ఖాళీగా వుంటుంది. కాబట్టి నేను బెనర్జీ ఇంటికి వెళ్లి సెలవురోజు సాయంత్రం దాకా అక్కడే గడుపుతాను. బెనర్జీ ఇంట్లో వంటవాడు నాకు కూడా భోజనం అక్కడే సిద్ధం చేస్తాడు.

అదిగో! ఆ వంట వాడి పేరే నారాయణ స్వామి. నిజం చెప్పొద్దూ, నారాయణ స్వామి వంట బాగా చేస్తాడు. బెనర్జీ తన భార్యను పుట్టింటికి పంపివేసిన తర్వాత ఈ రెండు సంవత్సరాల నుండి ఆ ఇంట్లో నారాయణ స్వామే వంట చేస్తున్నాడు. అయితే బెనర్జీ బ్రహ్మచారిగా వున్న రోజుల్లో కూడా ఈ నారాయణస్వామే వంట చేసే వాడు. ఆ తర్వాత బెనర్జీ పెళ్లి అయి సునీత ఆ ఇంటికి వచ్చాక కూడా వచ్చాడు.

సునీత చాలా మంచిపిల్ల. పెళ్లయిన కొత్తలో బెనర్జీ ఆ అమ్మాయి అంటే ప్రాణం ఇచ్చేవాడు. ఒకటి రెండుసార్లు సునీతను తీసుకుని మా ఇంటికి కూడా వచ్చాడు.

అయితే పెళ్లయిన కొన్ని నెలల తర్వాత ఒక ఆకాశరామన్న ఉత్తరం వచ్చింది. అందులో సునీతకు పెళ్లికి ముందే ఇంకో వ్యక్తితో సంబంధం వున్నదని, ఆమె శీలం లేని మనిషని రాసి వుంది. అంతే బెనర్జీ ఆమెను పుట్టింట్లో వదిలి వచ్చేసాడు. ఎన్ని రాయబారాలు జరిపినా ఒప్పుకోలేదు. అప్పటి నుండి ఒంటరిగానే వుంటున్నాడు. నేను, నా భార్య కూడా ఇటువంటివి నమ్మకూడదని చెప్పి చూశాము. అయినా బెనర్జీ వినలేదు.

"ఒక చిన్న సమస్య వచ్చింది!" చెప్పాడు బెనర్జీ.

"ఏమిటి?"

"మన నారాయణస్వామి ఉన్నాడు కదా?" అన్నాడు ఉపోద్ఘాతంలా.

చేతిలో టీ కప్పు పైకెత్తి చూపిస్తూ నవ్వుతూ అన్నాను.

"లేకపోతే ఇంత మంచి టేస్టు మనకు దొరకదు కదా?" బెనర్జీ కూడా నవ్వాడు.

"నారాయణస్వామి తండ్రి నిన్న సాయంత్రం వచ్చి నన్ను కలిసాడు. నారాయణ స్వామి సంసార జీవితం గూర్చి కొన్ని కొత్త విషయాలు చెప్పాడు"

ఆ తర్వాత ఎలా చెప్పాలా అని సంకోచిస్తున్నట్లు ఒక్క క్షణం మౌనంగా వున్నాడు ఆ తర్వాత చెప్పాడు.

"నారాయణ స్వామి భార్య మంచిది కాదట. పుట్టింటికి వెళ్లినప్పుడల్లా ఆమె మరొక వ్యక్తితో తిరుగుతుందట. ఈ విషయం నారాయణ స్వామితో చెప్పినా నమ్మ లేదట. నన్ను చెప్పమన్నాడు."

నేనేమీ మాట్లాడలేదు. నిశ్శబ్దంగా టీ తాగుతూ కూర్చున్నాను.

"మాట్లాడవేమిటి?" అడిగాడు బెనర్జీ.

"ఏం మాట్లాడమంటావు? ఇది పూర్తిగా నారాయణస్వామి కుటుంబ విషయం. మతి లేని ముసలివాడు ఏదో వాగాడని ఒక పచ్చని సంసారాన్ని కూల్చేద్దామా?"

నాకు తెలీకుండానే నా కంఠంలో కోపం తొంగి చూసింది. "ఆమె చేసేం దిఅన్యాయం కాదా? భర్తను మోసం చేసే ఇటువంటి ఆడవాళ్లను ఉరితీయాలి" గట్టిగా అరిచాడు బెనర్జీ.




నాకు తెలుసు. సునీతను అవమానించి 'పుట్టింటికి పంపేశాక బెనర్జీ ఆడవాళ్లంటేనే అసహ్యించుకుంటున్నాడు. ఆ కసి ఇపుడు నారాయణ స్వామి భార్యపై తీర్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు.

ఇంతలో నారాయణస్వామి ఖాళీ కప్పులు తీసుకు పోవడానికి వచ్చాడు.

"స్వామీ! నిన్న సాయంత్రం మీ నాన్న వచ్చి వెళ్లాడు" అన్నాడు బెనర్జీ.

"వాడు ఏం మాట్లాడి వుంటాడో నాకు తెలుసయ్యా. కాని. వాడి మాట విని కట్టుకున్న దాని ఉసురు నేను పోసుకోలేనండి"

"కానీ ఒక కులటను నీ భార్యగా వుంచుకుంటే అందరూ నవ్వుతారు"

ఒక్కక్షణం నారాయణస్వామి ముఖం నల్ల బడింది. మరుక్షణం సర్దు కున్నాడు.

"ఎవరో ఏదో అంటారని నా భార్యని వదిలేసి పిల్లలను అనాథలను చెయ్యలేను కదండి. పైగా ఇప్పుడు అదేమీ తప్పు చెయ్యడం లేదండి. పెళ్లికి ముందు తెలీక చేసిందట. పెళ్లి నాటికి అది కడుపుతో వుంది. ఆ విషయం నాతో చెప్పి ఇష్టం లేక పోతే వదిలెయ్య మందండి. పెళ్లికి ముందు నేను కూడా శ్రీరాముడిని కాదండి. ఆ మాత్రం దానికి దానిని తప్పు పట్టడం ఎందుకని వూరు కున్నానండి."

"కానీ నువ్వు మగవాడివి కదా?" అన్నాడు బెనర్జీ.

"అయితే ఏమిటండి?" చాలా అమాయకంగా అడిగాడు నారాయణస్వామి.

బెనర్జీకి ఏం మాట్లాడాలో తెలీ లేదు. మాటల కోసం తడుముకోసాగాడు. అతని అవస్థ గమనించినట్లు నారాయణస్వామే తిరిగి చెప్పాడు.

"పోనీ దాన్నివదిలేసి ఇంకో అమ్మాయిని చేసు కున్నా ఆ వచ్చింది మాత్రం నిజాయితీ కలదని ఎలా తెలుస్తుందండి! అది కూడా చెడ్డదని ఎవడో చెబితే దాన్ని కూడా వదిలేసి మళ్లీ ఇంకో దాన్ని చేసుకోవాలా? ఎందు కొచ్చిందండి? కంట్లో నలుసు పడిందని కన్ను పెరికి వేసినట్లు చిన్న విషయంపై పంతాలకు పోయి నా జీవితాన్ని,నాపై ఆధార పడిన ఆ ముగ్గురు జీవితాలను నాశనం చేసుకోమంటారా?"

"అయినా నా భార్యలో చాలా మంచి లక్షణాలు వున్నాయండి. నన్ను, పిల్లలను ఎంతో ప్రేమగా చూసుకుంటుంది. చిన్న చిన్న విషయాలకు గొడవలు పెట్టు కోదు. అత్తమామ ఏదో ఒకటి అంటూ చాలామంది ఆడవాళ్లలా వేధించదు. నేను కోపగించు కున్నా, సహనంతో భరిస్తుంది. ఇన్ని మంచి లక్షణాలున్నదాన్ని అర్థం పర్థం లేని చిన్న కారణం కొరకు వదిలేసుకోమంటారండి?"

ఆశ్చర్యంగా వినసాగాను. ఎంత ప్రాక్టికల్‌గా ఆలోచించాడు! ఇంత చదువూ చదివి పెద్దఉద్యోగం చేస్తున్న బెనర్జీ ఏ మాత్రం ఊహించని కోణం నుంచి ఆలోచించాడు. అయినా చిన్న అనుమానం నా మనసును తొలుస్తూనే వుంది.

"స్వామీ, ఒక చిన్న విషయం అడుగుతాను. ఏమీ అనుకోవు గదా?" అన్నాను.

"అడగండి. మనస్సులో ఒకటి పెట్టుకొని పైకి ఒకటి మాట్లాడే గొప్ప వాడిని కాదండి నేను" అన్నాడు. ఆ మాటల్లో ఏమైనా హేళన వుందా అని సరి శీలనగా అతని ముఖంలోనికి చూశాను. కానీ అటు వంటి ఛాయలేవీ కనిపించలేదు.

"నీ భార్య శీలవతి కాకపోయినా నీవు లెక్కచేయక పోవచ్చును. కాని ఎవరికోపుట్టిన బిడ్డను నీ బిడ్డతో సమానంగా ఎలా పెంచుతున్నావు?" అడిగాను.

"ఎందుకు చూడకూడదండి? ఆమె ఎప్పుడో తప్పు చేసిందని ఆ పసి వాడిని శిక్షించమంటారా? అయినా ఆ పిల్లలను నేను ఒక్కడినే పోషించడం లేదండి. నా భార్య కూడా నాతో సమానంగా సంపాదిస్తున్నదండి. ఇద్దరం సంపాదించి మా పిల్లలను పెంచుకుంటున్నాము."

నారాయణస్వామి లోపలకు వెళ్లి పోయాడు. బెనర్జీ వైపు చూసాను. అతని ముఖం వెల్లవేసిన గోడలా తెల్లగా మారి పోయింది. నారాయణస్వామి మాటలు ఎంత బలంగా పనిచేసాయో నాకు అర్థమయింది. నారాయణస్వామి మాటల్లో నిజాయితీ వుంది. పెళ్లికి ముందు తాను శీలం అనేది పట్టించు కోలేదు కాబట్టి తన భార్య శీలం గురించి పట్టించు లేదన్నాడు. జీవితాన్ని గురించి చాలా ప్రాక్టికల్‌గా ఆలోచించాడు. అనుమానం, అసూయ అనే పొకుడు రాళ్లపై కాలూని కిందికి దొర్లిపోయావని తెలియ జేశాడు. మరి, సునీతను గురించి బెనర్జీ ఏమనుకుంటున్నాడు? ఇపుడు బెనర్జీ ముఖంలో నేను కోరుకున్న మార్పు రూపొందుతోన్న సూచనలు కనిపిస్తోన్నాయి. ●